# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**తేదీ : జూన్ 15, 2021**

## కొరోనాతో మావోయిస్టుల మరణం ఒక బూటకం అది కేవలం పోలీసుల సృష్టి!

మన దేశంలో కోవిడ్ – 19 మహమ్మారీ రెండవ అల విజృంభణను అరికట్టడంలో ఘోరంగా విఫలమైన భారత పాలక వర్గాలు, కోట్లాది దేశ ప్రజలకు జవాబుదారీ వహించడం పోయి వీలైన అన్ని పద్ధతులలో ప్రజలను దారి మళ్లించే చర్యలకు, ప్రచారాలకు పూనుకుంటున్నారు. అందులో భాగంగానే ముఖ్యంగానే పోలీసులు రెండవ అల ప్రారంభం నుండి కొరోనాతో మావోయిస్టుల మరణం అంటూ పెద్దెత్తున ప్రచారం చేస్తున్నారు. దీనిని మా పార్టీ కేంద్ర కమిటీ నిర్ద్వందంగా ఖండిస్తున్నది. ఈ వార్తలన్నీ  కేవలం పోలీసుల కల్పిత కథనాలేననీ ప్రజలకు స్పష్టం చేస్తున్నది. కొరోనా సాకుతో మావోయిస్టులను ఉద్యమ బాట వదలి లొంగిపోవాలనీ కోరడం పోలీసుల దివాళాకోరుతనాన్ని ప్రదర్శించడమే తప్ప మరేం కాదు.

దేశంలో రెండవ విడుత కొరోనా ప్రబలడానికి కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణం తప్ప మరెవరూ కారు. ప్రధానంగా కేంద్రం కొరోనా ప్రమాద తీవ్రతను పక్కనపెట్టి 5 రాష్ట్రాలలో 8 విడుతలలో జరిగే సుదీర్ఘ ఎన్నికల రణరంగాన్ని సిద్ధం చేసింది. ఎన్నికల ప్రచారానికి జరిపిన భారీ ర్యాలీలు, రోడ్ షోలు, విశాల ప్రజా సభలు తెలిసినవే! దేశంలో మొదటి విడుత కొరోనా వ్యాప్తికి ముస్లిం సంస్థ 'తబ్లిగ్ ఏ జమాతీ' కారణమంటూ నిరాధారమైన ఆరోపణలు చేసి, నిందించి, ఆ సంస్థ విదేశీ కార్యకర్తలు మన దేశం రావడాన్ని నిషేధించింది. ఈసారి రెండవ విడుత కొరోనా మహమ్మారీ వ్యాప్తి ప్రమాద తీవ్రత ఎక్కువ ఉన్న సమయంలో తమ హిందూ దురభిమానంతో కుంభమేళాలు నిర్వహించారు. తత్ఫలితంగా కొరోనా అతి వేగంగా గంగా మైదానాలలోకి విస్తరించింది. గంగా నదిలో వందలాది గ్రామీణుల శవాలు తేలే దుస్థితిని కల్పించారు. మరోవైపు కోట్ల రూపాయల వ్యాపారంగా మారిన క్రికెట్ క్రీడను అనుమతించారు. అనేక చోట్ల పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. పాలకులు తమ రాజకీయ, ఆర్థిక లాభాల కోసం అనేక రకాలుగా పీడిత ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దీనిని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.

కొరోనా వ్యాక్సిన్ తయారీలో 'ఆత్మనిర్భర్' అంటూ మోదీ ప్రభుత్వం స్వోత్కోర్షతో ప్రగల్బాలు పలుకుతూ ఏ వయసు గ్రూపు వారికి కూడ దేశంలో పూర్తి కొరోనా డోసులు అందకుండా వారిని బ్లాక్ ఫంగస్ లాంటి మరిన్ని కొత్త రోగాల పాలు చేస్తున్నది. విదేశాల నుండి వ్యాక్సిన్ దిగుమతి చేసుకోవడంలో అనవసర తాత్సారం చేసి దేశంలో వేలాది మరణాలకు కారకులయ్యారు. కొరోనా మహమ్మారి వ్యాప్తితో ప్రజలు నానారకాలుగా ఇబ్బందులు పడుతూ, నష్టాల పాలవుతుంటే కొరోనా వ్యాక్సిన్ అమ్మకాలతో పాలకులు కార్పొరేటు సంస్థలకు లాభాలు పండించారు. ఇక వ్యాక్సిన్ దౌత్యం గురించి వెలువడుతున్న వార్తలు వింటునే ఉన్నాం. ఇలా అన్ని రకాలుగా కొరోనా మహమ్మారిని ఒక ఆర్థిక, రాజకీయ అస్త్రంగా మలుచుకొని ప్రజల ప్రాణాలు తోడేస్తున్న పాలకులు కనీసం శ్మశాన వాటికలలో శవదహనాలకు కర్రలైనా సమకూర్చని నీతిమాలిన రాజకీయాలను అతి నీచ స్థితికి దిగజార్చారు. వీటన్నిటిని మా పార్టీ నిర్ద్వందంగా ఖండిస్తూ పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా దృఢంగా, సమరశీలంగా పోరాడాల్సిందిగా పిలుపునిస్తోంది. కొరోనా సృష్టికర్తలైన దోపిడీ సామ్రాజ్యవాదులు వారి తాబేదార్ల ఉనికే లేకుండా పోయినపుడే ప్రజల ఆరోగ్యాలకు గట్టి హామీ ఉంటుంది.

పై పరిస్థితులలో ప్రజలకు జవాబుదారీ వహించాల్సిన పాలకులు వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ ప్రజలకు వాటిని నగ్నంగా బహిర్గతం చేస్తూ ప్రజల ఆరోగ్యాల పరిరక్షణ కోసం పాటుపడుతున్న మా పార్టీపై వారు దుష్ప్రచారం చేయడం ఈనాడు కొత్త కాదు. గతంలో మా పార్టీ నాయకత్వం రోగాల పాలై మంచాన పడిందంటూ అనేక కల్పిత కథనాలను ప్రచారం చేశారు. ఇటీవలే మా పార్టీ ప్రధాన నాయకత్వం లొంగుబాటుకు సిద్ధమైందంటూ సంచలనాత్మక వార్తలను విడుదల చేశారు. ఇపుడు మాకు కొరోనా సోకిందంటున్నారు. ఇలాంటి కథలు సృష్టించడంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసు బాస్‌లు మహా నేర్పరులు. దేశ పీడిత ప్రజలలో మా పార్టీ పట్ల పెరుగుతున్న ప్రేమాభిమానాలను, విశ్వాస నమ్మకాలను, ప్రతిష్టను వమ్ము చేయడానికి వారు అనేక రకాలుగా కుట్రలు పన్నుతున్నారు. వాటిలో భాగమే ప్రస్తుతం కొరోనా వ్యాధితో మావోయిస్టుల మరణాలు, కేడర్లను చికిత్సకు అనమతించడం లేదంటూ పోలీసులు జరుపుతున్న ప్రచారమంతా బూటకమే తప్ప అందులో రవ్వంత కూడ వాస్తవం లేదు. అలా మరణాలే జరిగి ఉంటే మా పార్టీ ఎలాంటి దాపరికం లేకుండా నిరభ్యంతరంగా ప్రకటిస్తుంది.

అవాకులు చవాకులతో విప్లవోద్యమం పై తప్పుడు వార్తలను ప్రచారం చేయడం పాలకులకు అవసరం. అందుకు తమ చేతులలోని మీడియాను అది తప్పక వినియోగించుకుంటుంది. కానీ, తమ వృత్తి ధర్మానికి తిలోదకాలిచ్చి తానా అంటే తందానా అన్న చందంగా కొంత మంది పాత్రికేయులు పోలీసు వార్తలను ప్రచారం చేయడాన్ని కూడ మాపార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. విప్లవ రాజకీయాల నుండి హీనాతిహీనంగా దిగజారిపోయిన జంపన్నకు విప్లవ రాజకీయాలపై, పార్టీపై మాట్లాడడానికి కనీస నైతిక అర్హత కూడ లేదని మా పార్టీ ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తోంది. మాజీ మావోయిస్టుగా అవతారమెత్తిన జంపన్న చీటికీ మాటికీ పోలీసుల కథనాలకు వంత పాడుతూ మీడియా

ముందు ప్రత్యక్షం కావడం ఆయనకు మంచిది కాదని కూడ హెచ్చరిస్తున్నాం.

మావోయిస్టులు మానవాతీతులు ఏమీ కారు. ప్రపంచాన్ని కుదిపివేస్తున్న కొరోనా మహమ్మారి ప్రజల మధ్య పనిచేస్తున్న మావోయిస్టులకు సోకదనే గ్యారంటీ ఏమి లేదు. కాకపోతే, ఈనాటి వరకు మా ఉద్యమ ప్రాంతాల ప్రజలకు, మాకు ఆ మహమ్మారి సోకలేదనే వాస్తవాన్ని మేం ఈ పత్రికా ప్రకటన ద్వార విప్లవ ప్రజలకు, విప్లవ సానుభూతిపరులకు, భారత ప్రజల ప్రజాస్వామిక విప్లవోద్యమ విజయాన్ని ఆకాంక్షించే సమస్త మిత్ర శక్తులకు తెలియచేస్తున్నాం. పోలీసులు ప్రకటించిన జాబితాలోని వారితో సహ మా పార్టీలో ఏ ఒక్కరికీ కొరోనా ఇప్పటి వరకు సోకలేదనీ మా కార్యకర్తలందరూ చురుగ్గా విప్లవ కార్యక్రమాలలో పాల్గొంటున్నారనీ ముఖ్యంగా వారి బంధు మిత్రులు ఎంతమాత్రం ఆందోళన పడాల్సిన అవసరం లేదనీ కోరుతున్నాం.

కొరోనా సాకుతో మావోయిస్టుల లొంగుబాటుకు ఉవ్విళ్లూరుతున్న తెలంగాణ పోలీసులు అనారోగ్యంతో ఉన్న మా ప్రియమైన కామేడ్స్ గంగాలు, శోభ్రాయిలను ఇటీవలే అరెస్టు చేసి వారికి కొరోనా పాజిటివ్ తేలిందనే అబద్దాలను తెగ ప్రచారం చేసి వారిని నాటకీయంగా ఆసుపత్రులలో చేర్చినట్టు చూపి మానవీయ విలువలను మంటగలుపుతూ నిర్దాక్షిణ్యంగా హత్య చేశారు. మావోయిస్టులు లొంగిపోతే మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తామనీ, వారు ప్రధాన స్రవంతిలో జీవించవచ్చని నమ్మ బలుకుతున్నారు. కానీ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న దోపిడీ పీడన, అణచివేత సహ అన్ని రకాల రుగ్మతలకు వ్యతిరేకంగా ఒక ఆరోగ్యకరమైన, దోపిడీ రహిత నూతన సమాజ నిర్మాణం కోసం అత్యంత అంకిత భావంతో అహర్నిశలు కృషి చేస్తున్న ఏ విప్లవకారులు సామ్రాజ్యవాదులు సృష్టించే వ్యాధులకు వెరచి సామ్రాజ్యవాద అంతానికై పోరాడుతున్న విప్లవోద్యమాన్ని వదలుకోరని స్పష్టం చేస్తోంది. ఇలాంటి దుష్ప్రచారాన్ని ఎంతమాత్రం నమ్మకూడదనీ, ఎలాంటి ఆందోళనకు గురికాకూడదనీ యావత్ విప్లవ క్యాంపును కోరుతున్నాం.

పోలీసులకు విజ్ఞప్తి: మీరు మాకు ఇంకా సోకని కొరోనాకు మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఏమీ లేదు కానీ, వివిధ ప్రాంతాలలో మా కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళుతూ కొరోనా జాగరూకత కార్యక్రమాలు చేపడుతుంటే వారిపై కాల్పులకు పాల్పడడం మీ పాశవిక మనస్తత్వాన్ని చాటుతుంది. మహమ్మారీ కాలంలో అలాంటి సాడిస్టు చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి. .



**అభయ్,**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**